సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



రూ.2,44,348 విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి స్థానిక వ్యాపారులు వీర్ల సూరిబాబు, చక్రరావు, రాంబాబు శనివారం రూ.2,44,348 విరాళాన్ని దేవస్థానం ఈఓ సుబ్బారావుకు అందజేశారు.



సుదర్శన హోమానికి రూ.లక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో సుదర్శన హోమానికి నముడూరి వెంకట సత్య సోమయాజులు, సురేషా దంపతులు, కుటుంబ సభ్యులు (చెన్నై) శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 9,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.85 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

నగర పాలక సంస్థకు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డుతో కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థకు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఘన వ్యర్థాల నిర్వహణలో పాటించిన విధానాలకు ఈ గౌరవం దక్కింది. ఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్‌ఈ) ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ చేంజ్ మేకర్స్ కాంక్లేవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ తరఫున మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న ఈ అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ మాత్రమే ఎంపిక కావడం విశేషం. కాగా.. అవార్డుతో తిరిగివచ్చిన డాక్టర్ వినూత్న తదితరులను శనివారం కార్పొరేషన్ కమిషన్ కేతన్ గార్గ్ అభినందించారు.

ఉద్యోగ కల్పనే లక్ష్యం



జాబ్ మేళాలో ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న మంత్రి దుర్గేష్

కొవ్వూరు: రానున్న ఐదేళ్లలో ఇరవై లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొవ్వూరు ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ మేళాకు 1,500 మంది నిరుద్యోగులు హాజరు కాగా, సుమారు 600 మందికి ఉద్యోగావకాశాలు లభించాయని చెప్పారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు ఆయా పరిశ్రమలకు, సంస్థలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం పెంచుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. జిల్లాలో సచివాలయాల ద్వారా ఇంటింటా స్కిల్ సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు, ఆర్డీఓ రాణి సుస్మిత, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వికాస అధికారి కె.లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రధానితో చర్చా కార్యక్రమానికి పేర్ల నమోదు



డైట్ ప్రిన్సిపాల్ కమల కుమారి

నల్లజర్ల: ప్రధానితో పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు జనవరి 14 లోగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కమల కుమారి కోరారు. ఆరు నుంచి 12వ తరగతి వరకూ ప్రభుత్వ, గ్రాంట్ ఇన్ ఎయిడ్, స్టేట్ సెకండరీ, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ పాఠశాలల విద్యార్థులు దీనికి అర్హులని వివరించారు. ఇందులో పాల్గొనే విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందిస్తారన్నారు. దేశవ్యాప్తంగా 2,500 మంది విద్యార్థులకు ఈ చర్చా కార్యక్రమం కిట్లు అందిస్తారన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలు, ఎంఈఓలు శ్రద్ధ తీసుకుని, అర్హత గల ప్రతి విద్యార్థి పేరును పరీక్షా పే చర్చా-2025 వెబ్‌సైట్‌లో నమోదు చేయించాలని కోరారు. దీనికి డైట్ కళాశాల అధ్యాపకులు పి.దుర్గారావును జిల్లా నోడల్ అధికారిగా నియమించామని తెలిపారు. వివరాలకు 86394 36737 మొబైల్ నంబర్‌లో ఆయనను సంప్రదించాలని కమల కుమారి సూచించారు.

నేడు డిపార్టుమెంటల్ పరీక్షలు



డీఆర్‌ఓ సీతారామమూర్తి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఏపీపీఎస్సీ ఆధ్వర్యాన ఆదివారం డిపార్టుమెంటల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) టి.సీతారామమూర్తి శనివారం తన చాంబర్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్థానిక రాజీవ్‌గాంధీ విద్యా సంస్థల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్టుతో పాటు, ప్రభుత్వ ఫొటో గుర్తింపు కార్డుతో హాజరు కావాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించే పరీక్షకు అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకూ మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. ఈ పరీక్షకు 249 మంది హాజరవుతారన్నారు.



చాగల్లులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీసీ కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



బిక్కవోలులో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలోని వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్లు అందజేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

జననేతకు జేజేలు

- ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు
- జిల్లావ్యాప్తంగా కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు



రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కార్యాలయంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యాన కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు చెల్లుబోయిన వేణు, జక్కంపూడి రాజా, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా విప్లవాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన దార్శనికుడు.. సంక్షేమ ప్రదాత.. పేదల బాంధవుడు.. విద్యార్థులకు మావయ్య.. పింఛనర్లకు పెద్ద కొడుకుగా.. రాజకీయాల్లో సమున్నత విలువలకు పెద్దపీట వేసిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు జననేత జన్మదినోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సేవా కార్యక్రమాలతో మానవత్వం చాటుకున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసి తమ అభిమాన నేతకు శుభాకాంక్షలు తెలిపారు.

- **రాజమహేంద్రవరం పార్లమెంటరీ కార్యాలయంలో..**

మాజీ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో మానవీయ దృక్పథంతో పాలన సాగించారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని గూడూరి శ్రీనివాస్ కార్యాలయంలో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

- **రాజమహేంద్రవరం రూరల్**

బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యాన జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, పార్టీ శ్రేణులకు తినిపించారు. పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు పాల్గొన్నారు. బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, దుప్పట్లు పంపిణీ చేశారు.

- **రాజానగరంలో..**

రాజానగరం నియోజకవర్గంలో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. రాజానగరం మండలం కొత్తతుంగపాడు గ్రామంలో సర్పంచ్ కొలపాటి వెంకన్న ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. రాధేయపాలెంలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. శ్రీరంగపట్నం, కోటికేశవరం, చినకొండేపూడి గ్రామాల్లో సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించారు.

- **కొవ్వూరులో..**

నియోజకవర్గవ్యాప్తంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ శ్రేణుల ఆధ్వర్యాన పలు ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేసి, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

- **అనపర్తిలో..**

వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బిక్కవోలు పీహెచ్‌సీ వద్ద రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. వైఎస్ జగన్ చేసిన మంచిని కొనియాడారు.

- **గోపాలపురంలో..**

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తానేటి వనిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కృష్ణంపాలెం వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

- **నిడదవోలులో..**

వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు ఆధ్వర్యాన మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు కేక్‌లు కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు భోజనాలు ఏర్పాటు చేశారు.



రాజమహేంద్రవరంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్. చిత్రంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

- **మాజీ ఎంపీ భరత్ ఆధ్వర్యాన..**

మనసున్న వైఎస్ జగన్ ప్రజలకు ఎంతో మంచి చేసే వ్యక్తి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లో మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. జగన్ తిరిగి అధికారంలోకి వచ్చి ఉంటే ప్రజలకు మరింత మంచి జరిగేదన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కేక్ కట్ చేయించారు. 'హ్యాపీ బర్త్ డే టూ జగనన్న' అని అందరూ నినదించారు. అనంతరం వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మార్గాని భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు క్రికెట్ ఆడి, ఉత్సాహపరిచారు.

- **రాజమహేంద్రవరంలో రక్తదానం**

రాజమహేంద్రవరం సంహిత కన్వెన్షన్ హాలులో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ తదితరులు స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, పేదరికాన్ని తొలగించేందుకు, పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను అందించేందుకే వైఎస్సార్ సీపీ ఆవిర్భవించిందని అన్నారు. అధినేత జగన్ సుదీర్ఘ పాదయాత్ర చేసి, అధికార, ప్రతిపక్షాల నుంచి ఇబ్బందులు, కేసులు ఎదుర్కొని, పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు.

జక్కంపూడి రాజా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల అభిమాన నాయకుడు వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లేందుకే జగన్ రాజకీయాల్లోకి వచ్చారని చెప్పారు. పేదలను ఉన్నత స్థాయికి తీసుకుని వెళ్లేందుకు జగన్ ప్రతి అడుగూ వేశారన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి, రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీని విజయపథంలో నడిపిస్తారని అన్నారు.



రాజమహేంద్రవరంలో రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా. చిత్రంలో పార్టీ నేతలు వేణు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

సంక్షోభంలో సమతూకమా!

- సమీకరణాలతో డీసీ చైర్మన్ల నియామకం
- అనుభవాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- తూర్పు డెల్టా జనసేనకు.. మధ్య డెల్టా టీడీపీకి..
- సాగునీటి యాజమాన్యంపై అన్నదాతల పెదవి విరుపు



సెంట్రల్ డెల్టాలో లొల్ల లాకులు

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టా సంక్షోభంలో ఉంది. మూడు పంటలు పండే ఈ ప్రాంతంలో ఖరీఫ్, రబీ వరిసాగు చేయలేని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. పంట కాలువలు అధ్వానంగా.. మురుగునీటి కాలువలు పూడుకుపోయి నీటి యాజమాన్యం అస్తవ్యస్తంగా తయారైంది. సిబ్బంది అనుభవ లేమి, నిర్లక్ష్యం వల్ల డెల్టా వ్యవస్థ ఇలా తయారైంది. కనీసం పూడిక తొలగింపునకు సైతం ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వని దుస్థితి. ఈ సమయంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్లను అనుభవం ఉన్నవారిని.. సమర్థులను ఎంపిక చేసి ఉంటే సరిపోయేది. రాజకీయ పార్టీ.. కులాలు.. ప్రాంతాల ప్రాతిపదికన కొత్తవారిని ఎంపిక చేయడం, వారికి డెల్టా వ్యవస్థపై పెద్దగా అనుభవం లేకపోవడం రైతులను నిరుత్సాహానికి గురి చేస్తోంది.

గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు సాఫీగా సాగిపోయాయి. టీడీపీ అధిష్టానం.. టీడీపీ ఎమ్మెల్యేలు నిర్ణయించిన చైర్మన్, వైస్ చైర్మన్లను డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు (డీసీలు) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పదవుల పంపిణీలో అసంతృప్తులు తలెత్తకుండా గోదావరి డెల్టాను తూర్పు, మధ్య డెల్టాలుగా వీడదీసి చైర్మన్, వైస్ చైర్మన్లు ఎన్నుకున్నారు. ఒక ప్రాజెక్టు కమిటీ పరిధిలో ఇద్దరు చైర్మన్ల అవసరం ఏమిటో? వారి విధి విధానాలు, బాధ్యతలు ఏమిటో ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీకి అమలాపురం, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ కాకినాడ కలెక్టరేట్‌లలో శనివారం ఎన్నికలు నిర్వహించారు.

గోదావరి మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పి.గన్నవరం డీసీ గుబ్బల శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. ఆయన నీటి సంఘాలకు పూర్తిగా కొత్త. తొలుత ఈ పదవికి కాట్రేనికోన డీసీ ఆకాశం శ్రీనివాస్ పేరు తెరపైకి వచ్చింది. గతంలో డీసీగా పని చేసిన అనుభవం కూడా ఉండడంతో పాటు సామాజిక సమీకరణలలో కూడా ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. శుక్రవారం రాత్రి వరకు శ్రీనివాస్ పేరు వినిపించగా, రాజోలు, పి.గన్నవరం జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు దేవ వర ప్రసాద్, గిడ్డి సత్యనారాయణ పట్టుబట్టి పి.గన్నవరం డీసీ గుబ్బల శ్రీనివాస్‌ను ఎంపిక చేయించారు. సొంత పార్టీకి చెందిన రాజోలు నుంచి పినిశెట్టి బుజ్జి ఉన్నప్పటికీ సామాజిక సమీకరణల పేరుతో అతని పేరును పక్కనబెట్టారు. ఆకాశం శ్రీనివాస్‌కు వైస్ చైర్మన్ పదవికి ఎంపిక చేసి పంపించారు. అయితే అమరావతి నుంచి వచ్చిన జాబితాలో శ్రీనివాస్ స్థానంలో కరుటూరి నర్సింహరావు పేరు రావడం గమనార్హం. ఈయన సైతం నీటి సంఘాలకు కొత్త. లోకేష్ ద్వారా చెప్పించుకుని తెరపైకి రావడంతో శ్రీనివాస్‌కు మొండి చేయి దక్కింది.

గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ)- డీసీ మారాలశెట్టి సునీల్ కుమార్ (జనసేన) ఎంపిక కాగా, వైస్ చైర్మన్‌గా అనపర్తి డీసీ తమలంపూడి సుధాకర్ రెడ్డి (టీడీపీ) ఎన్నికయ్యారు. వీరిద్దరూ నీటి సంఘాలకు కొత్త కావడం విశేషం.

ఈ ప్రాంతంలో కొమరిపాలెం, కోటిపల్లి, కూళ్ల డీసీలుగా ఎంపికైన కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, దాట్ల వెంకట రాజ గోపాలరాజు, మేకా శివ ప్రసాద్ గతంలో నీటి సంఘాలలో పనిచేసిన అనుభవం ఉంది. కొత్తగా ఎన్నికైన వారికి ఆ అనుభవం కూడా లేకపోవడం గమనార్హం.

దాట్ల మాటకు దక్కని ప్రాధాన్యం

తన పరిధిలో మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి వచ్చేలా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఆకాశం శ్రీనివాస్‌కు చైర్మన్, వైస్ చైర్మన్ పదవి రాకపోవడంతో పాటు తన నియోజకవర్గం పరిధిలో తాళ్లరేవు డీసీ వేగేశ్న భాస్కర రాజుకు తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ పదవికి పట్టుబట్టినా ఫలితం లేకపోయింది.

పునాదులు బాగుంటేనే మంచి ఫలితాలు

రాజానగరం: ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు విద్యా పునాదులు బాగున్నప్పుడే మంచి ఫలితాలు వస్తాయని సమగ్ర శిక్షా రాష్ట్ర పరిశీలకుడు ఆర్.రంగయ్య అన్నారు. కొండగుంటూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆరు రోజులుగా జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ ఐదో బ్యాచ్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయశ్రీ మాట్లాడుతూ పొందిన శిక్షణను క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలు చేయాలని అన్నారు. కోర్సు కో ఆర్డినేటర్ పి.రాంబాబు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు భాష, గణితంలో బలమైన పునాదులు ఏర్పరిచేందుకు ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులకు ఆరు రోజుల శిక్షణ ఇచ్చామన్నారు. కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 277 మంది ఉపాధ్యాయులు ఈ బ్యాచ్‌లో శిక్షణ పొందారని తెలిపారు. ఆరో బ్యాచ్ శిక్షణ ఈ నెల 26 నుంచి 31 వరకూ జరుగుతుందన్నారు. శిక్షణలో బోధనోపకరణాలను తయారు చేసి, ప్రదర్శించడంలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు ఉత్తమ టీఎల్ఎం మేకర్స్ అవార్డులు అందించారు. అలాగే విభిన్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను సత్కరించారు.

సత్యసాయి గురుకులంలో నేడు గణితోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ సత్యసాయి గురుకుల పాఠశాల ఆవరణలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం ఆధ్వర్యాన గణితోత్సవం నిర్వహిస్తున్నారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ, ఆర్గనైజర్ మేకా సుసత్యరేఖ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి గణిత ఉపాధ్యాయులు, మేధావులు, గణిత అవధానులు ఈ వేడుకల్లో పాల్గొంటారన్నారు. రంగోలీ పోటీలు, క్విజ్, పేపర్ ప్రజెంటేషన్, గణిత పాటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గణిత విషయ నిపుణుడు కేవీవీ సత్యనారాయణ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర చిత్ర రూపంలో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. అలాగే గణిత బోధనోపకరణాలపై ప్రత్యేక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ కాకినాడ జోన్-2 సంయుక్త సంచాలకులు నాగమణి, డిప్యూటీ డైరెక్టర్ ఎస్.అబ్రహం, జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి వాసుదేవ రావు, కాకినాడ, కోనసీమ డీఈఓలు రమేష్, షేక్ సలీం బాషా, సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ గుర్రయ్య తదితరులు పాల్గొంటారని వివరించారు.

క్లుప్తంగా

గజరాజుకు ఘన నివాళి

చిట్టి బాబాజీ సంస్థానానికి చెందిన లీల ఆకస్మిక మృతి



శ్రీరామనగరం ఆశ్రమంలో మృతి చెందిన లీల

సీతానగరం: మండల భక్త జన హృదయాలను దోచుకున్న చిట్టి బాబాజీ సంస్థానానికి చెందిన లీల (ఏనుగు) (19) శనివారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందింది. 2009 ఆగష్టు పదిన అరుణాచల్ ప్రదేశ్ నుంచి అప్పటి సీఎం ఈ సంస్థానానికి బహూకరించారు. మూడున్నరేళ్ల వయస్సులో ఆశ్రమానికి వచ్చిన లీల నిత్యం తెల్లవారుజామున గోదావరి నది స్నానం చేసిన అనంతరం గోదావరి జలాలను తీసుకువచ్చేది. ఈ గోదావరి జలాలతో ఆశ్రమంలోని చిట్టిబాబాజీకి అభిషేకం చేవారు. నిత్యం గోదావరి నది నుంచి తిరిగి వచ్చే సమయంలో భక్తులు పెట్టిన పండ్లు, స్వీట్లు, రెట్టెలు అందుకుంటూ వారిని ఆశీర్వదించేది. లీల మృతితో అటవీశాఖాధికారి రవీంద్ర ధామ, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆశ్రమ ప్రతినిధి జగ్గుబాబుతో చర్చించారు. వెటర్నరీ డాక్టర్ ఫణీంద్ర పంచనామ చేసి ఖననం చేయడానికి అనుమతి ఇచ్చారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నాయకులు పెందుర్తి అభిరామ్ లీలకు శ్రద్ధాంజలి ఘటించారు. పెదకొండేపూడిలోని ఆశ్రమ గోశాల వద్ద లీలను ఖననం చేశారు.

వేట్లపాలెం హత్యల కేసులో మరో 10 మంది అరెస్టు

సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో సంచలనం సృష్టించిన హత్యలకు సంబంధించి మరో 10 మందిని అరెస్టు చేసినట్లు సీఐ ఎ.కృష్ణభగవాన్ శనివారం రాత్రి తెలిపారు. ఈనెల 15వ తేదీ ఆదివారం రాత్రి కర్దాల చంద్రరావు, ప్రకాశరావు, ఏసుబాబులను కొందరు కత్తులతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే 12 మందిని అరెస్టు చేశారు. కాగ శనివారం సామర్లకోట మండలం, హుస్సేన్‌పురం గ్రామంలో శ్రీరామకృష్ణ ఫైర్ వర్క్స్ సమీపంలో బచ్చల రాజ్‌కుమార్, బచ్చల చంద్రరావు, గుల్ల సునీల్ కుమార్, సికోటి రాజేంద్రప్రసాద్, గుడాల సన్నిబాబు, బచ్చల జార్జి, తోలేటి రాంబాబు, గుడాల వినోద్‌కుమార్, కోళ్ల రాజు, బచ్చల లక్ష్మణ్‌లను అరెస్టు చేసిన్నట్లు సీఐ తెలిపారు. దాంతో ఇప్పటి వరకు 22 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు కత్తులు, ఐదు కర్రలు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

సాగునీటికి సమగ్ర కార్యాచరణ

- రబీలో ప్రతి ఎకరాకూ నీరు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- జెడ్పీటీసీలకు ప్రొటోకాల్ తప్పనిసరి
- అధికారులకు జెడ్పీ చైర్మన్ విప్పర్తి ఆదేశం
- వివిధ శాఖల అంశాలపై జెడ్పీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణ రావు, చిత్రంలో ఎమ్మెల్సీలు అనంతబాబు, ఐవీ రావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, చిత్రంలో కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కాకినాడ సిటీ: రానున్న రబీ సీజన్‌లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇందుకు క్షేత్ర స్థాయి పరిస్థితులపై అవగాహనతో పూర్తి స్థాయిలో ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ రూపొందించాలని వివిధ శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేసింది. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయం, వైద్య, ఆరోగ్యం తదితర శాఖలపై అజెండా ప్రకారం సమీక్షించారు. వ్యవసాయంపై జరిగిన చర్చలో ప్రజాప్రతినిధులు ఏలేరు, గోదావరి కాలువలకు రబీలో పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి పనులను రైతులు మొదలుపెట్టారని అధికారులు నివేదించారు. రబీ సీజన్‌లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు చైర్మన్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. రబీలో గోదావరి, ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు కింద ఉన్న రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు సభ్యులకు వివరించారు.

ఈ సందర్భంగా చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు నేరుగా సంబంధం ఉన్న ఏకైక పంచాయతీరాజ్ వ్యవస్థ అన్నారు. జెడ్పీ సభ్యులు తమ పరిధిలోని ప్రజా సమస్యలను మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో అన్ని పీహెచ్‌సీ, అర్బన్ యూపీహెచ్‌ల ద్వారా నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు సరిపడా మందులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని సభ్యులు కోరారు. జెడ్పీటీసీ సభ్యులు తమ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన 50 శాతం బిల్లులను జనవరి మొదటి వారం నుంచి తమ బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని, మిగిలిన 50 శాతం మార్చి నాటికి విడుదల చేస్తామని చైర్మన్ తెలిపారు. మండల, గ్రామస్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలపై ప్రోటోకాల్ ప్రకారం జెడ్పీటీసీ సభ్యుల పేర్లు కచ్చితంగా ఉండేటట్టు చూడాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు జరిగే జిల్లా సర్వసభ్య సమావేశానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అన్ని జిల్లాల అధికారులు విధిగా హాజరై ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఎమ్మెల్సీ ఐవీ రావు మాట్లాడుతూ జిల్లా పరిషత్ పరిధిలోని జెడ్పీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సకాలంలో అందించాలన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ వ్యవసాయ ఇరిగేషన్, డ్రైనేజీ కాలువలలో పరిశ్రమలు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను విడుదల చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ సామాన్యుడికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రయోజనం చేకూర్చేలా చూడాలన్నారు. ఇసుక ర్యాంపుల వద్ద సరిహద్దులు దాటి ఇసుక తవ్వడం, రాత్రి 9 గంటల వరకు లోడింగ్ చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఎంతో దూరప్రాంతాల నుంచి సర్వసభ్య సమావేశాలకు, స్థాయీ సంఘాల సమావేశాలకు హాజరయ్యే సభ్యుల సమయం వృథా కాకుండా గత సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికలు అందచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో రామ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చేందుకే దోపిడీ యత్నం

- చెడు సావాసాలు.. బెట్టింగులతో తప్పుడు దారి
- జ్యూయలరీ షాపు దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్
- ఒకరు ప్రభుత్వ సర్వేయర్.. మరొకరు సాఫ్ట్‌వేర్ నిపుణుడు
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీహరి రాజు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరిరాజు, పక్కన సీఐ సూరి అప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబు



దోపిడీ కోసం కొనుగోలు చేసిన కత్తులు, తాడు, సుత్తి, కారం పొడి ప్యాకెట్



నిందితులు సంచిలో పెట్టిన బంగారు ఆభరణాలు



దోపిడీకి పాల్పడిన నిందితులు ఉద్దగిరి అఖిల్, మామిడి రాజు

అన్నవరం: ఆ యువకులిద్దరూ విద్యాధికులే.. ఒకరు ప్రభుత్వ ఉద్యోగి.. ఇంకొకరు సాఫ్ట్‌వేర్ నిపుణుడు. చెడు సావాసాలు, బెట్టింగులతో అప్పులపాలై వాటిని తీర్చడానికి అయాచితంగా డబ్బు సంపాదించాలని జ్యూయలరీ షాపులో దోపిడీకి పాల్పడ్డారు. యూట్యూబ్ జ్ఞానంతో దొంగతనానికి యత్నించి దొరికిపోయి జీవితాలు పాడు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జీవన జ్యూయలర్స్‌లో దోపిడీ యత్నం ఘటన వివరాలను డీఎస్పీ డి.శ్రీహరిరాజు శనివారం అన్నవరం పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. ఈ కేసులో నిందితులు ఉద్దగిరి అఖిల్, మామిడి రాజు శుక్రవారం అర్ధరాత్రి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల స్వస్థలం తొండంగి మండలం ఏ కొత్తపల్లి. ఇద్దరి వయసు 24 ఏళ్లు, వీరిలో అఖిల్ తొండంగి మండలం, సీతారామపురం సచివాలయంలో విలేజి సర్వేయర్ కాగా, మామిడి రాజు సాఫ్ట్‌వేర్ కంపెనీలో కొంత కాలం పనిచేశాడు. వారు వ్యసనాలకు, బెట్టింగులకు బానిసలై అప్పులపాలై వాటిని తీర్చేందుకు దొంగతనం చేయాలని అన్నవరంలోని జీవన జ్యూయిలర్స్‌లో రెండు సార్లు రెక్కీ నిర్వహించారు.

తునిలో పరికరాల కొనుగోలు

దొంగతనం చేయాలని నిర్ణయించినదే తడవుగా తునిలోని డీమార్ట్‌లో రెండు చిన్న కత్తులు, ఒక సుత్తి, ఆశీర్వాద్ కారంపొడి, తాడు కొనుగోలు చేశారు. అలాగే రెయిన్ కోట్లు, హెల్మెట్లు ధరించి నెంబర్ ప్లేట్ లేని స్కూటీపై శుక్రవారం సాయంత్రం జీవన జ్యూయిలరీ షాపునకు వచ్చి మొదట ఆ షాపు యజమాని వరదా లక్ష్మణరావు, ఆ తరువాత వారి బంధువు మంగరాజు, యజమాని భార్య రాజేశ్వరిపై సుత్తితో దాడి చేసి గాయపరిచారు. షో రూమ్ లోని కేజీన్నర బంగారు ఆభరణాలను వారు తెచ్చుకున్న సంచిలో వేసుకున్నారు. ఇంతలో దుకాణం యజమాని, అతని భార్య, వారి బంధువుల కేకలకు స్థానికులు రావడంతో పారిపోయే ప్రయత్నంలో వారికి దొరికిపోయారు. ఆధారాలు దొరకకూడదని హెల్మెట్‌కు గల కంపెనీ స్టిక్కర్‌సైతం తొలగించారు. కాగా దుకాణంలో సీసీ టీవీ ఏర్పాటు చేసుకున్నప్పటికీ దుకాణం తెరిచినపుడు మాత్రమే ఆన్‌చేసి మధ్యాహ్నం భోజన విరామ సమయంలో, రాత్రి వేళల్లో ఆఫ్ చేస్తున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలినట్టు డీఎస్పీ వివరించారు. అలా కాకుండా ఒకటి దుకాణం బయటకు, ఒకటి లోపలి భాగం కవరయ్యేలా 24 గంటలూ కెమేరాలు ఆన్‌లో ఉంచాలని ఆయన సూచించారు. ప్రత్తిపాడు సీఐ బి.సూరి అప్పారావు, అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు జగన్ నాంది



జెడ్పీ బంగ్లాలో జగన్ పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ అనంతబాబు, జెడ్పీటీసీలు

జెడ్పీ చైర్మన్ విప్పర్తి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నిరుపమానమైన సేవలు అందించారని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. చంద్రబాబు మాదిరిగా కాకుండా అమలు చేయగలిగే హామీలను మాత్రమే ప్రజలకు ఇచ్చిన చిత్తశుద్ధి కలిగిన ఏకైక నాయకుడు జగన్ అన్నారు. కాకినాడ జెడ్పీ బంగ్లాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని జిల్లా పరిషత్ సభ్యుల సమక్షంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ నేతల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేసి పంచారు. ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి అలవి కాని హామీల జోలికి పోకుండా సాగిన జగన్ సంక్షేమ పాలన తిరిగి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ జడ్పీటీసీలు పాల్గొన్నారు.

కారు ఇంజిన్‌లో మంటలు



దగ్ధమైన కారు ఇంజిన్ భాగం

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు వద్ద సంత మార్కెట్ సమీపంలో శనివారం రాత్రి కారు ఇంజిన్‌లో మంటలు చెలరేగి పెను ప్రమాదం తప్పింది. అమలాపురం నుంచి పి.గన్నవరం వెళ్తున్న కారు కాట్రేనిపాటు వచ్చే సరికి ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దీనిని గమనించిన స్థానికులు డ్రైవర్‌ను అప్రమత్తం చేసి మంటలను అదుపు చేశారు. దీంతో కారులో ఉన్న ఇద్దరు పిల్లలతో సహా మొత్తం ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు.

మిస్టర్ నన్నయ విజేత కాకినాడ

- ఉత్సాహంగా బెస్ట్ ఫిజిక్, రెజ్లింగ్ పోటీలు
- భళా అనిపించిన వర్సిటీ విద్యార్థులు



బెస్ట్ ఫిజిక్ విజేతలు

రాజానగరం: గోదావరి జిల్లాల్లో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు అన్నారు. వర్సిటీలో అంతర్ కళాశాలల బెస్ట్ ఫిజిక్ (మెన్), రెజ్లింగ్ (మెన్ అండ్ ఉమెన్) జట్టు ఎంపికలకు శనివారం పోటీలను ప్రారంభించారు. వర్సిటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో అనుబంధ కళాశాలల నుంచి బెస్ట్ ఫిజిక్ పోటీలకు 32 మంది, రెజ్లింగ్ పోటీలకు 45 మంది హాజరయ్యారు. మిస్టర్ యూనివర్సిటీ 2024-25 ట్రోఫీని కాకినాడ ఐడియల్ కళాశాల విద్యార్థి టి.ప్రశాంత్ కైవసం చేసుకున్నాడు.

బెస్ట్ ఫిజిక్‌లో విజేతలు

- ఈ పోటీలు 60, 65, 70, 75, 80, 85 కేజీల కేటగిరీలలో జరిగాయి. ఉత్తమ ప్రతిభను కనబరచి, మొదటి మూడు స్థానాలలో నిలిచిన వారిని విజేతలుగా ప్రకటించారు.
- 60 కేజీల విభాగంలో వై.భరత్ (ఆదిత్య కళాశాల, సూరంపాలెం), షేక్ వల్లీ (పీఆర్ కళాశాల, కాకినాడ), ఆర్‌కే విశ్వనాథం (ఐడియల్ కళాశాల, కాకినాడ),
- 65 కేజీల విభాగంలో ఎం.సాయిలోకేష్ (సీఆర్ రెడ్డి కళాశాల, ఏలూరు), ఎస్. దినేష్‌కుమార్ (పీఆర్ కళాశాల, కాకినాడ), ఎస్.నాగ సందీప్ (కాకతీయ కళాశాల, భీమడోలు).
- 70 కేజీల విభాగంలో ఎస్‌కె మన్సూర్ (విష్ణు కళాశాల, భీమవరం), ఎ.జగదీప్ (ఏబీఎన్ఎస్ కళాశాల, పాలకొల్లు), పి.భానుచంద్ర (ఆదిత్య కళాశాల, కాకినాడ),
- 75 కేజీల విభాగంలో ఎల్‌వీ సూర్యప్రకాష్ (పీఆర్ కళాశాల, కాకినాడ), ఎం.జగదీష్ మణికంఠ (డాక్టర్ బీవీ రాజు కళాశాల, భీమవరం), జె.దైవప్రసాద్ (పీఆర్ కళాశాల, కాకినాడ).
- 80 కేజీల విభాగంలో టి.ప్రశాంత్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), దిలీప్‌కుమార్ (ఏబీఎన్ కళాశాల, కొవ్వూరు), ఎన్.సుకుమార్ (పీఆర్ కళాశాల, కాకినాడ).
- 85 కేజీల విభాగంలో వై.మోహన్‌సాయి, అభిషేక్ (పీఆర్ కళాశాల, కాకినాడ), జె. జయకర్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తణుకు) ఉన్నారు.
- టీమ్ చాంపియన్‌షిప్ కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలకు దక్కింది.

యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ (మెన్) జట్టుకు నలుగురి ఎంపిక

ఈ జట్టులో టి. ప్రశాంత్, ఎల్‌వీ సూర్య ప్రకాష్, ఎస్‌కే మన్సూర్, వై.భరత్ ఎంపికయ్యారు. వీరు కర్నాటకలోని మెనుపోయ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

రెజ్లింగ్ జట్టు..

మహిళల కేటగిరీలో 50 నుంచి 76 కేజీల విభాగంలోను, పురుషుల కేటగిరీలో 57 నుంచి 97 కేజీల విభాగంలోను రెజ్లింగ్ పోటీలు జరిగాయి. వీటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన పది మంది చొప్పున వర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. వీరు పంజాబ్‌లోని గురుదాస్ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని క్రీడా నిర్వాహక చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో డి.జ్యోతిర్మయి, ఎంపీఎస్ఎస్ మూర్తి, డీవీ రమణ, ఆర్‌బీఎల్‌కే రత్నకర్, శ్రీనివాసరాజు, కె.దుర్గాదేవి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని నయంత విశ్వ విద్యాలయం సీఈఓ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ 4వ స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కృషి చేసినప్పుడే గొప్ప విజయాలు సొంతమవుతాయన్నారు. సెంచూరియన్ వర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్‌రావు విద్యార్థులు సాధించిన విజయాలను ప్రశంసించారు. వర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. వీసీ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ శక్తివంతమైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీలు, పీహెచ్‌డీలు, స్వర్ణ పతకాలు, ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో భువనేశ్వర్ వర్సిటీ వీసీ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ పల్లవి, పాలకమండలి సభ్యుడు, పారిశ్రామికవేత్త కుమార్ రాజా, డాక్టర్ పీఎస్ ఠాగూర్ పాల్గొన్నారు.